
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
ఆదివారం 22 సెప్టెంబరు 2024



మైనర్‌లకు వాహనాలిస్తే కేసు
- సీపీ డాక్టర్ బి.అనురాధ
6

మంత్రి పొన్నంకు హుస్నాబాద్‌పై ప్రేమ లేదు
- కరీంనగర్, హైదరాబాద్‌పైనే ఆలోచన
- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్
8

హామీలు అమలు చేసే వరకు
వదిలిపెట్టం

- 27న నంగునూరు నుంచి రైతు ధర్నాలు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


టెలీకాన్ఫరెన్స్‌లో హరీశ్‌రావు

నంగునూరు, సెప్టెంబరు 21 : రుణమాఫీ, రైతుబంధు, పంటలకు బోనస్ ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ, ప్రభుత్వాన్ని నిలదీస్తూ రైతు ధర్నా నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం ప్రకటించారు. సన్నాహక ఏర్పాట్లపై రైతులు, పార్టీ నాయకులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కాక జిల్లాలో ఎంతో మంది రైతులు ఆందోళన చెందుతున్నారని వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రుణమాఫీ విషయంలో సీఎం ఒక మాట, మంత్రి ఒక మాట మాట్లాడుతున్నారని ఆరోపించారు. పంట పెట్టుబడి సాయం అందక రైతులు కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నపుడు ఇప్పటికే రైతుబంధు ఇచ్చి పంటకు భరోసానిచ్చారని తెలిపారు. రైతుల పట్ల అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను దుయ్యబట్టేందుకు ఈ నెల 27 నుంచి నంగునూరు మండల కేంద్రంలో ఉదయం 10 గంటలకు రైతు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, రైతు కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఇక్కడ చేపట్టే నిరసన సెగ ప్రభుత్వానికి తగలాలన్నారు. రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందన్నారు. రుణమాఫీ, రైతుబంధు, పంటలకు బోనస్ ఇప్పించే వరకు ప్రభుత్వంపై నిర్విరామ పోరాటం చేస్తుందని తెలిపారు.

దంచికొట్టిన వాన

- ఉమ్మడి జిల్లాపై వరుణుడి ప్రతాపం
- అత్యధికంగా సంగారెడ్డి జిల్లా దిగ్వాల్‌లో 9.8 సెం.మీ.లు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 21: ఉమ్మడి మెదక్ జిల్లాలో వర్షాలు మళ్లీ దంచికొడుతున్నాయి. పది రోజుల విరామం ఇచ్చిన వరుణుడు మళ్లీ ప్రతాపం చూపుతున్నాడు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలో శనివారం భారీ వర్షాలు కురిశాయి. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాష్ట్రంలోనే అత్యధికంగా సంగారెడ్డి జిల్లా దిగ్వాల్‌లో 9.8 సెం.మీ వర్షపాతం నమోదైంది. బంగాళఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దాని ప్రభావం జిల్లాపై ఉంటుందని వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో, రానున్న మూడు రోజుల పాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అంతేకాకుండా బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. గంటలకు 30-40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ప్రజలు అవసరమైతేనే బయటలకు వెళ్లాలని సూచించింది.

దిగ్వాల్‌లో కుండపోత
అత్యధికంగా సంగారెడ్డి జిల్లా దిగ్వాల్‌లో గంటపాటు కుండపోత కురిసింది. ఇక్కడ రాష్ట్రంలోనే అత్యధికంగా 9.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల గణాంక అధికారి హేమలత తెలిపారు. అల్లోల్ 6.5సెం.మీ., మాల్చెల్మ 4.9సెం.మీ., కోహీర్ 4.4సెం.మీ., న్యాల్కల్ 3.5సెం.మీ., సత్వార్ 2.5 సెం.మీ., రాయికోడ్ 2.3సెం.మీ., జిన్నారం 1.7సెం.మీ., మెదక్ జిల్లాలో చిన్నశంకరంపేట 4.5సెం.మీ., దామరంచ 3.8సెం.మీ., ఇస్లాంపూర్ 3.6సెం.మీ., చిట్కుల్ 1.3సెం.మీ., సిద్దిపేట జిల్లాలో బేగంపేట 1.8సెం.మీ., బెజ్జంకి 1.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.


నిండుగా పారుతున్న కోహీర్‌లోని నారింజ వాగు

నారింజ గేటు ఓపెన్
జహీరాబాద్, సెప్టెంబరు 21: భారీ వర్షానికి నారింజ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్‌లో ప్రారంభమైన వాగు 10 గ్రామాల మీదుగా కొత్తూర్(బి) వద్ద నిర్మించిన నారింజ ప్రాజెక్టుకు చేరుతుంది. జహీరాబాద్, కోహీర్ మండలాల్లో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి నారింజకు వరద ఉధృతి పెరిగింది. దీంతో, ఇరిగేషన్ డీఈఈ వెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రాజెక్టు గేటు ఎత్తి నీటిని కిందికి విడుదల చేశారు. ప్రాజెక్టుకు మొత్తం 7 గేట్లు ఉండగా.. ఒక గేటును ఎత్తారు. 3,122 క్యూసెక్కుల వరద వస్తుండగా మొత్తం కిందికి వదులుతున్నామని అధికారులు తెలిపారు. కాగా, ఈదురుగాలులకు ప్రాజెక్టు వద్ద బీదర్‌కు వెళ్లే రోడ్డుపై చెట్టు విరిగిపడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు, అధికారులు చేరుకుని చెట్టును తొలగించారు.

నీటిశుద్ధి కేంద్రానికి మోక్షమెప్పుడో..?
- కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని గ్రామ వాటర్ ప్లాంట్
- కొడకండ్లలో తాగునీటి తండ్లాట
- ప్రైవేటు తాగునీటి శుద్ధి కేంద్రాలతో ప్రజల జేబులకు చిల్లు

7



తల్లిదండ్రుల ఏమరపాటు.. తప్పిపోయిన బాలుడు
- అమ్మనాన్నలను రప్పించి అప్పగించిన పోలీసులు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీస్

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 21 : తల్లిదండ్రులు ఏమరపాటుగా వ్యవహరించడంతో ఆర్టీసీ బస్సులో నుంచి ఓ బాలుడు దిగి తప్పిపోగా, ఆటో డ్రైవర్ సాయంతో పోలీసులు గుర్తించి తల్లిదండ్రులను పట్టుకుని అప్పగించిన సంఘటన శనివారం సిద్దిపేట పట్టణంలో చోటుచేసుకున్నది. కంట్రోల్‌రూమ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశం గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మహిళ తన కుమారుడు బెన్షర్‌తో కలిసి సిరిసిల్ల నుంచి సికింద్రాబాద్ వెళ్లేందుకు వేములవాడ డిపోకు చెందిన టీఎస్ 08 జెడ్ 0090 నంబర్ గల ఆర్టీసీ బస్‌లో ప్రయాణిస్తుంది. మార్గమధ్యలో మధ్యాహ్నం 3.30 గంటలకు సిద్దిపేట ఓల్డ్ బస్టాండ్ వద్ద బస్సు ఆగగానే పిల్లవాడు ఒక మహిళతో కిందికి దిగాడు. గమనించని తల్లిదండ్రులు బస్సులో వెళ్లిపోయారు. పిల్లవాడు ఆ మహిళ దగ్గర ఉండి ఏడుస్తుండగా, పక్కనే ఉన్న ఆటో డ్రైవర్ డయల్ 100కు కాల్ చేసి చెప్పారు. వెంటనే కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తమై ఆ మహిళ వద్ద ఉన్న టికెట్స్, ఆటో డ్రైవర్‌తో వాట్సాప్ చేయించుకున్నారు. టికెట్‌పై ఉన్న నంబర్‌కు ఫోన్ చేయగా వేములవాడ డిపో మేనేజర్ ఫోన్ లిఫ్ట్ చేసి బస్సు నంబర్ చెప్పారు. బస్సు కండక్టర్ మొబైల్ ఫోన్ నంబర్ ఇచ్చాడు. కంట్రోల్ రూమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ భిక్షపతి, వెంటనే కండక్టర్‌కు ఫోన్ చేసి బాబు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు వెంటనే సిద్దిపేటకు తిరిగి పయనమయ్యారు. వారు ఓల్డ్ బస్టాండ్ వద్దకు రాగానే పోలీసులు పూర్తి విచారణ జరిపి అబ్బాయిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమారుడిని క్షేమంగా అప్పగించినందుకు పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ కంట్రోల్ రూమ్ సిబ్బందిని అభినందించారు. త్వరలో రివార్డ్ అందజేస్తామని తెలిపారు.

సిద్దిపేటకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి ఓ నంబర్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. మేము ఢిల్లీ పోలీసులం మాట్లాడుతున్నాం అంటూ అతడి కుమారుడి పేరుతో సహా చెప్పి మీ అబ్బాయి డ్రగ్స్ కేసులో హైదరాబాద్‌లో దొరికాడు. ఢిల్లీకి కస్టడీకి తీసుకెళ్తున్నాం. వెంటనే డబ్బు పంపిస్తే వదిలేస్తామని చెప్పాడు. అబ్బాయి పేరు కూడా చెప్పడంతో షాక్ తిన్న ఆ ఉద్యోగి వెంటనే తేరుకుని తన కుమారుడికి ఫోన్ చేశాడు. ఎక్కడ ఉన్నాడో తెలుసుకోగా కాలేజీలో ఉన్నట్లు తేలింది. ఫోన్ చేసిన వ్యక్తికి గట్టిగా సమాధానం ఇవ్వడంతో కాల్ కట్ చేశాడు.

ఓ వ్యాపారవేత్తకు ఫోన్ చేసి మీ కుమారుని కిడ్నాప్ చేశాం. వెంటనే డబ్బు పంపిస్తేనే వదిలిపెడతాం. లేకుంటే చంపేస్తాం అని బెదిరించారు. వెంటనే అప్రమత్తమైన వ్యాపారవేత్త తన కుమారుడు ఎక్కడ ఉన్నాడో తెలుసుకుని ఫోన్ చేసిన వారిని ఎదిరించాడు.



ఫోన్ చేసి.. ఎరవేసి

సైబర్ కేటుగాళ్ల నయా మోసం.. ఫేక్‌కాల్స్‌తో బెదిరింపులు

- పిల్లలను కిడ్నాప్ చేశామని.. డ్రగ్స్ కేసులో అరెస్టు అంటూ..
- డబ్బు పంపిస్తే వదిలేస్తామని బురిడీ
- మోసపూరిత కాల్స్ పట్ల తస్మాత్ జాగ్రత్త

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 21 : ఇలాంటి బెదిరింపు కాల్స్ ఇటీవల పెరిగిపోయాయి. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి.. ఎర వేసి ముంచేస్తున్నారు. పోలీస్ దుస్తులతో ఉన్న డీపీలను పెట్టుకుని, ట్రూ కాలర్‌లోనూ పోలీస్ ఆఫీసర్ అని చూపించేలా సాంకేతికతను వాడుకుని మోసపూరిత కాల్స్ చేస్తున్నారు. మీ పిల్లలను కిడ్నాప్ చేశామనో లేదా డ్రగ్స్ కేసులో అరెస్టు చేశామంటూ డబ్బులిస్తేనే వదిలేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. కొందరు అవగాహన ఉన్న వారు ఫేక్‌కాల్స్‌ను పసిగట్టి, అప్రమత్తం అవుతుండగా మరికొందరు అమాయకులు వారి ఉచ్చులో చిక్కుకుంటున్నారు. వారి మాటలు నమ్మి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా డబ్బులు పంపించి మోసపోతున్నారు. జిల్లాలో ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు సైబర్ నేరగాళ్ల ఫేక్‌కాల్స్‌కు భయపడి నలుగురు వ్యక్తులు డబ్బు పంపించారు. తరువాత మోసపోయామని తెలుసుకుని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు విధాలుగా..
సైబర్ నేరగాళ్లు రెండు విధాలుగా ఫేక్ కాల్స్ చేస్తున్నారు. మొదటిది మేము కొరియర్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి ఆధార్ కార్డు నంబర్, ఫోన్ నంబర్ చెబుతున్నారు. వివరాలు కరెక్ట్‌గా ఉండడంతో బాధితులు సానుకూలంగా మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో మీ కొరియర్‌లో డ్రగ్స్ వచ్చింది. మేము నార్కోటిక్ వారికి సమాచారం అందిస్తున్నామని చెబుతారు. తర్వాత కొద్దిసేపటికి పోలీస్ యూనిఫాంలో ఉన్న వారు వాట్సాప్ కాల్ గాని, స్కైప్ కాల్ గాని చేసి మీ మీద డిజిటల్ కేసు నమోదు అవుతుందని చెప్పి డబ్బు ఇవ్వాలని బెదిరిస్తారు. రెండోది సైబర్ నేరగాళ్లు ఆడవారితో న్యూడ్‌గా వాట్సాప్ వీడియో కాల్ చేయించి స్క్రీన్ షాట్ తీస్తారు. తర్వాత ఆ ఫొటోను సోషల్ మీడియాలో పెడతామని బాధితులకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులను వసూలు చేస్తారు.



సోషల్ మీడియా నుంచి డాటా
సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్ వంటి వాటి నుంచి ఫోన్ నంబర్లను, ఫొటోలను సేకరిస్తున్నారు. నిఘా ఏర్పాటు చేసి వారి కుటుంబసభ్యుల వివరాలను తెలుసుకుని సమయం చూసి ఫేక్‌కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడుతూ డబ్బును వసూలు చేస్తున్నారు. మరి కొంతమంది సైబర్ నేరగాళ్లు ఏకంగా ఫేస్‌బుక్ హ్యాక్ చేసి, ఫేక్ ప్రొఫైల్ క్రియేట్ చేసి బాధితుల ప్రొఫైల్ పిక్చర్‌తో వారి ఫ్రెండ్స్‌లిస్ట్‌లోని వారికి మెసేజ్ చేసి డబ్బులు అడుగుతున్నారు.

అవగాహన కల్పిస్తున్న పోలీసులు
సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ఫేక్ కాల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో లిఫ్ట్ చేయొద్దని చెబుతున్నారు. ఒకవేళ సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేస్తే పోగొట్టుకున్న డబ్బును సీజ్ చేయవచ్చని తెలియజేస్తున్నారు. అనుమానాస్పదమైన కాల్స్ వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెబుతున్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడి అనవసరంగా డబ్బు పోగొట్టుకోవద్దని సూచిస్తున్నారు.

గురుకులంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి/దౌల్తాబాద్, సెప్టెంబరు 21 : గరుకుల పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన దౌల్తాబాద్ మండల పరిధిలోని లింగరాజుపల్లి ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలను, మిరుదొడ్డి మండలం అల్వాల సాంఘిక సంక్షేమ బాలురు గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యా బోధన, భోజన సదుపాయాలు బాగున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటలను పరిశీలించారు. అనంతరం బక్కి వెంకటయ్య మాట్లాడుతూ పాఠశాలలో ప్రమాదస్థాయికి చేరిన పాత భవనాలను తొలగించి నూతన నిర్మాణాలు చేపట్టేందుకు, ఇతర వసతుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడుతానని విద్యార్థులకు భరోసా కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కర్త రణం శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు రహీమొద్దీన్, మిరుదొడ్డి ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు తదితరులున్నారు.


మిరుదొడ్డి మండలం అల్వాల్ గురుకులంలో వంటలను పరిశీలిస్తున్న బక్కి వెంకటయ్య



పౌష్టికాహారంతోనే ఆరోగ్యం: సీడీపీవో సుజాత


నాగల్‌గిద్ద, సెప్టెంబరు 21: పౌష్టికాహారంతోనే బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో సుజాత అన్నారు. శనివారం మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలతో పాటు పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. దీంతోపాటు అంగన్‌వాడీ కేంద్రంలో ఇస్తున్న బాలామృతం, పలు రకాల వంటలు చేసుకోవచ్చన్నారు.













మైనర్లకు వాహనాలిస్తే కేసు

● సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ


సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 21: మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా ప్రజలకు సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ సూచించారు. మైనర్ డ్రైవింగ్ వల్ల ఎంతోమంది పిల్లలు చనిపోవడం, క్షతగాత్రులుగా మిగలడం జరుగుతుందన్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న పిల్లలను ఎంతో కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని చెప్పారు. మైనర్ డ్రైవింగ్ వల్ల సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ పట్టణాల్లో, గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది క్షతగాత్రులయ్యాయని తెలిపారు. మైనర్ డ్రైవింగ్ చేసేవారి, వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఏడాది మైనర్ డ్రైవింగ్ చేసేవారిపై 798 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మైనర్ డ్రైవింగ్, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు గురించి సిద్దిపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ ట్రాఫిక్ సిబ్బంది, స్కూళ్లలో, కాలేజీల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, మైనర్ డ్రైవింగ్ వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

టేక్మాల్, సెప్టెంబరు 21: జీవితంపై విరక్తితో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఎస్ఐ రాజేష్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సింగూరి మహేశ్వరి(26)కు సింగూరి రమేష్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఒక సంవత్సరం బాగానే ఉన్నారు. తర్వాత రమేష్ మద్యానికి బానిసగా మారాడు. తాగొద్దని భార్య ఎంత చెప్పినా వినకపోవడంతో మనస్తాపానికి గురైంది. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉన్న యాసిడ్‌ను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న మహేశ్వరి తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మహేశ్వరి కోలుకోవడంతో తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. మహేశ్వరీ అనారోగ్యంతో ఉండడంతో చికిత్స చేయించేందుకు ఉస్మానియా ఆసుపత్రికి ఈనెల 18న తీసుకవెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరక తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొత్తపల్లిలో వ్యక్తి అదృశ్యం


మహేష్‌గౌడ్(ఫైల్)

గుమ్మడిదల సెప్టెంబరు 21: వ్యక్తి అదృశ్యమైన సంఘటన గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డమీది మహేష్(3) ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ రావడంతో భార్య మాధురి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పొలం దగ్గరికి వెళ్లిన మహిళ...


నాగమణి(ఫైల్)

శివ్వంపేట, సెప్టెంబరు 21: మతిస్థిమితం లేని మహిళ పొలం దగ్గరికి అని వెళ్లి అదృశ్యమైంది. ఈ సంఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో శనివారం చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. శివ్వంపేట గ్రామానికి చెందిన లస్కరి నాగమణి(30) ఈనెల 18న ఉదయం 5 గంటలకు పొలం దగ్గరికి వెళ్లింది. రాత్రి 8 గంటలకు నాగమణి భర్త లస్కరి నర్సింహులు ఇంటికొచ్చి చూడగా.. నాగమణి కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

బోరు మోటారు దొంగల అప్పగింత


మోటార్, పైపు కేబుల్‌ను పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

శివ్వంపేట, సెప్టెంబరు 21: బోరు మోటార్‌ను దొంగిలించిన వ్యక్తులను గ్రామస్థులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గుండ్లపల్లిలో శనివారం చోటు చేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కిషన్‌రావు పొలంలో గురువారం అర్ధరాత్రి బోరు బావిలో నుంచి మోటారు, పైపు, కేబుల్ వైర్‌ను ట్రాక్టర్‌లో అపహరించుకుపోయి రహస్య స్థలంలో పెట్టారు. శనివారం దానిని గుర్తించిన గ్రామస్థులు దొంగతనానికి పాల్పడిన గ్రామానికి చెందిన మస్కూరి స్వామి, మస్కూరి శేఖర్, గంపల విక్రమ్‌తో పాటు ట్రాక్టర్‌ను పోలీసులకు అప్పగించారు.





మోర్గి వంతెన పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నారాయణఖేడ్, సెప్టెంబరు 21: మోర్గి వంతెనపై అసంపూర్తి పనులు నిత్యం అవస్థలు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో గత నెల 11న ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం పంచాయతీ రాజ్ ఎస్ఈ జగదీశ్వర్, ఈఈ అంజయ్య ఆ వంతెనను పరిశీలించారు. నారాయణఖేడ్, బీదర్‌ల మధ్య అంతర్ రాష్ట్ర రహదారిపై మోర్గి సమీపంలో రూ.620 కోట్లతో చేపట్టిన వంతెన పనులను దక్కాఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థ అసంపూర్తిగా వదిలివేసింది. ఏడు పిల్లర్లతో చేపట్టిన ఈ పనులను పరిశీలించిన అధికారులు, నాణ్యతారహితంగా ఉన్న వాటిని తొలగించి తిరిగి పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వారి వెంట డిప్యూటీ ఈఈ దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జైలు సూపరింటెండెంట్

● తొలిసారిగా ఎస్పీ స్థాయి అధికారి



సంతోష్‌కుమార్ రాయ్

కంది, సెప్టెంబరు 21 : కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబద్‌లోని చర్లపల్లి సెంట్రల్ జైలు నుంచి ఆయన బదిలీపై సంగారెడ్డికి వచ్చారు. ఈ సందర్భంగా జైలు అధికారులు, సిబ్బంది సంతోష్‌కుమార్‌రాయ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంగారెడ్డి జిల్లా జైలును 2023 జనవరిలో సెంట్రల్ జైలుగా ప్రకటించిన తర్వాత డీఎస్పీ స్థాయి అధికారులే సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు. ఇప్పుడు తొలిసారిగా ఎస్పీ స్థాయి అధికారి జైలు పర్యవేక్షణ అధికారిగా పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ రాయ్ మాట్లాడుతూ జైళ్లశాఖ ప్రవేశపెట్టిన సంస్కరణల అభివృద్ధికి తోడ్పాటునందిస్తానన్నారు. పరివర్తన కార్యక్రమాల ద్వారా ఖైదీల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు.

'యువజనోత్సవాల' పోటీలకు దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 21 : సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో ఈ నెల 27న జిల్లా యువజనోత్సవాలు, సైన్స్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఖాసింబేగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జానపద నృత్యం(గ్రూప్), సోలో, జానపద గీతం(గ్రూప్), సోలో, స్టోరీ రైటింగ్, కవితలు, పెయింటింగ్ తదితర పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు ఉన్న జిల్లా వాసులు కలెక్టరేట్‌లోని జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులు ఈ నెల 25వ తేదీలోగా సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7386191141, 8431639907 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రేపు జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 21 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న సంగారెడ్డిలోని జూబ్లీ క్లబ్ ప్రాంగణంలోని ఎం.ఎస్. అకాడమీలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు క్రికెట్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఎ.రాజేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 నుంచి వరంగల్‌లో జరిగే అండర్-19 అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులు 1.9.2005 నుంచి 31.08.2008 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, బోనాఫైడ్‌తో ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని పేర్కొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి



అంతర్గాం శివారులో మృతిచెందిన ఎద్దు

కల్హేర్, సెప్టెంబరు 21 : సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం శివారులో పిడుగుపడి ఎద్దు మృతిచెందింది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన గైని అంజయ్య శనివారం తన ఎద్దును పంట పొలాల వద్ద ఉన్న చెట్టు కింద కట్టేసి పొలం పనులు చేసుకుంటున్నాడు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో ఆ చెట్టుపై పిడుగు పడటంతో ఎద్దు మృతిచెందింది. పేద రైతు అంజయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ రవిపటేల్, గ్రామస్థులు కోరారు.

● **పాపన్నపేట** : పాపన్నపేటలోని పాతూరులో శనివారం సాయంత్రం పిడుగు పడింది. రాముని పాదాల వద్ద ఉన్న వేప చెట్టుపై పిడుగు పడగా కొమ్మ విరిగి కింద పడింది. ఎలాంటి ప్రాణనష్టమూ సంభవించలేదు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 21: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన పెద్దశంకరంపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పేటలోని వడ్డెరవాడకు చెందిన ఎల్గోయి కుమార్(38) శనివారం భార్యతో గొడవపడ్డాడు. దీంతో క్షణికావేశంలో తన కాలనీలోకి వెళ్లే మార్గంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ శంకర్ ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడిని హైవే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వివరాలు సేకరించారు. కాగా, బాధితుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.



వివరాలు సేకరిస్తున్న పేట ఎస్ఐ శంకర్

నీటిశుద్ధి కేంద్రానికి మోక్షమెప్పుడో..?

● కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని గ్రామ వాటర్ ప్లాంట్
● కొడకండ్లలో తాగునీటి తండ్లాట
● ప్రైవేటు తాగునీటి శుద్ధి కేంద్రాలతో ప్రజల జేబులకు చిల్లు..



నిరుపయోగంగా నీటి శుద్ధి కేంద్రం

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 21: సుమారుగా 3000 జనాభా గల గ్రామం తాగునీటి సమస్యతో తండ్లాడుతున్నది. గ్రామానికి కూతవేటు దూరంలో కొండపాకలో మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రం ఉన్నప్పటికీ నిత్యం కొడకండ్ల గ్రామస్థులకు తాగునీటిగోస తప్పడంలేదు. గ్రామంలో నీటిశుద్ధి కేంద్రం శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా మారడంతో సమస్య మరింత జఠిలమైంది. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు వాటర్ ప్లాంట్స్‌వారు చేతికి అందినకాడికి దండుకుంటున్నారు. అయినా గ్రామ నీటిగోసను పాలకవర్గం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

గ్రామంలోని వాటర్‌ప్లాంట్ శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారిన్నా ప్రజాప్రతినిధులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. గజ్వేల్ మండలంలోని జనాభా ప్రాతిపదికన ఉన్న పెద్ద గ్రామాల్లో కొడకండ్ల గ్రామం కూడా ఒకటి. ఇది పారిశ్రామిక ప్రాంతం కావడంతో దాతల సహాయంతో గ్రామంలో పదేండ్ల క్రితం నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గతంలో గ్రామ పంచాయతీ బాధ్యత తీసుకొని, గ్రామసభ ఏర్పాటు చేసి బహిరంగంగా వేలం వేసి నీటిశుద్ధి కేంద్రం నిర్వహణ బాధ్యతను అప్పగించేది. వేలంలో వచ్చిన డబ్బును విడతల వారీగా వసూలు చేస్తూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేసేది. దీంతో చుట్టు పక్కల గ్రామాలైన రిమ్మనగూడ, రాయవరం, తిమ్మాపూర్, పిటివెంకటాపూర్, రామచంద్రపూర్ గ్రామాల ప్రజలకు తాగునీటికి ఢోకా ఉండకపోయేంది. అనంతరం పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మరమ్మతులకు నోచుకోక తాగునీటి శుద్ధి కేంద్రం నిరుపయోగంగా మారింది. గత మూడు సంవత్సరాలుగా దాన్ని పట్టించుకునే నాథుడేలేడు. స్థానిక పరిశ్రమలు ఇస్తున్న నిధులు ఎటు పోతున్నాయో? తెలియని పరిస్థితి. ఇదిలా ఉండగా గ్రామంలో ఏకంగా మూడు ప్రైవేటు తాగునీటి శుద్ధి కేంద్రాలు పుట్టుకురాగా, తప్పని పరిస్థితుల్లో నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. ప్రభుత్వ అధికారులు, పాలకవర్గం ఇకనైనా మేల్కొని గ్రామంలో నీటిశుద్ధి కేంద్రాన్ని ఉపయోగంలోకి తెచ్చి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామప్రజలు కోరుతున్నారు.



నీటిని కొనలేకపోతున్నాం : కర్నాల గణేష్, కొడకండ్ల గ్రామస్థుడు

గతంలో రూ.5కే 20 లీటర్ల నీరు లభించేది. ఇతర గ్రామాలవారు కూడా ఇక్కడి నుంచి నీటిని తీసుకెళ్లేవారు. వేలం పాటలో దక్కించుకున్నవారికి ఉపాధి కూడా లభించేది. కొన్నేళ్లుగా గ్రామంలోని వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. అప్పటి నుంచి దాన్ని పట్టించుకునేవారేలేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్‌ప్లాంటును ఉపయోగంలోకి తేవాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ప్రకృతివనం ఎదుట పిచ్చిమొక్కల తొలగింపు

శివ్వంపేట, సెప్టెంబరు 21 : బృహత్ పల్లె ప్రకృతి వనం నిర్వహణ గాలికి వదిలేయడంతో ప్రకృతి వనం.. వికృతరూపం అనే శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో గ్రామ ప్రత్యేక అధికారి నాగేశ్వర్ స్పందించారు. ఈ మేరకు శనివారం మండల పరిధిలోని గోమారం బృహత్ పల్లె ప్రకృతి వనం ఎదుట పెరిగిన పిచ్చి మొక్కలను ఎన్నిమిది మంది పంచాయతీ సిబ్బందితో తొలగింపజేశారు. ప్రకృతి వనంలోలప మొక్కల రక్షణకూ అవసరమైన చర్యలు చేపట్టారు.

తెలంగాణ సాయుధపోరాటంలో చాకలి ఐలమ్మ పాత్ర మరువలేనిది

● కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్



ఐలమ్మ కాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు శ్వేత, కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు/పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 21: తెలంగాణ సాయుధ పోరాటంలో వీర వనిత చాకలి ఐలమ్మ పాత్ర మరువలేనిదని, వారి కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని కాంగ్రెస్ నాయకుడు నీలంమధుముదిరాజ్ అన్నారు. ఐలమ్మ మునిమనవరాలు, ఇటీవల రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా ఎన్నికైన శ్వేత శనివారం పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో కాంగ్రెస్ నాయకుడు నీలంమధుముదిరాజ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్, నాయకులు చాకలి వెంకటేశ్, విష్ణువర్ధన్ రెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్, మురళి, ఆంజనేయులు, రజక సంఘం రాష్ట్ర నాయకులు సత్యానారాయణ, కృష్ణ, నర్సింహులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా ఎన్నికైనందుకు శ్వేతను నీలం మధుముదిరాజ్ సన్మానించారు. కోటిలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడంతోపాటు ఆమె మునిమనుమరాలు శ్వేతకి మహిళా కమిషన్ సభ్యురాలుగా అవకాశం ఇవ్వడంపై నీలం మధు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా చిట్కుల్ ఎన్ఎమ్ఆర్ కార్యాలయంలో శనివారం బాపూజీ చిత్రపటానికి కాంగ్రెస్‌నేత నీలం మధు ముదిరాజ్ నివాళులర్పించారు.

వల్లూర్‌లో ముదిరాజ్‌ల సామాజిక బహిష్కరణ

చేగుంట, సెప్టెంబరు 21: మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూర్ గ్రామంలో ముదిరాజ్ కులస్తులను ఇతర కులస్తులు సామాజికి బహిష్కరణ చేశారు. గత 20 రోజులుగా అన్నికులాల వారు ముదిరాజ్ కులస్తులను ఎలాంటి పనులకు రాకుండా బహిష్కరించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కుల సంఘం నాయకులు మాట్లాడుతూ అన్ని కులాలకు వారివారి కులవృత్తులు ఉండగా.. ముదిరాజ్‌లకు గత ప్రభుత్వం చెరువులు, కుంటల్లోని మత్స్య సంపదపై హక్కులు కల్పించిందని చెప్పారు. గ్రామంలోని చెరువులు, కుంటలకు సంబంధించిన సొసైటీలు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ అనుమతులు కూడా పొందామని, అయితే కావాలని వల్లూర్‌లోని ఇతర కులాల వారు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులోని మత్స్య సంపదపై వాటా ఇవ్వాలని డిమాండ్ చేయగా.. తాము నిరాకరించడంతో అందరూ కలిసి ముదిరాజ్ కులస్తులను సామాజిక బహిష్కరణ చేయడం ఎంతవరకు సమంజసమని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులు చొరవ తీసుకుని ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు నర్సింహులు, గణేష్, అంజనేయులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు. ;



ప్రభుత్వ అనుమతి పొందిన పత్రాలు చూపిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

భారత సమ్మిళితాభివృద్ధికి మనవంతు చేయూతనిద్దాం

● వివిధ రంగాల నిపుణులు, ప్రముఖులు



కార్యక్రమంలో వక్తలు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 21 : సమగ్ర విధానాలతో దేశ సమ్మిళితాభివృద్ధికి చేయూతనిద్దామని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ద్వైవార్షిక కొలాక్వీలో భాగంగా శనివారం భారతదేశం కోసం సమగ్ర విధానాలు అనే అంశంపై ముఖాముఖి చర్చలను నిర్వహించారు. కార్యక్రమంలో విభిన్న రంగాలకు చెందిన ప్రభుత్వ, ప్రభుత్వేతర నిపుణులు, ఉన్నతాధికారులు పాల్గొని ఆయా అంశాలపై తమదైన శైలిలో పరిష్కార మార్గాలు చూపడంతో పాటు పలు సూచనలు చేశారు. ఆర్థిక రంగ భవిష్యత్తుపై చర్చలో డాక్టర్ రతిన్‌రాయ్, చేజ్ ఇండియా ఉపాధ్యక్షుడు కౌశల్ మహన్, ఐఆర్ఎస్ పూర్వ అధికారి పర్మిలా చావలీ పాల్గొన్నారు. పబ్లిక్ పాలసీలో మహిళలు అనే అంశంపై వీహబ్ అసోసియేట్ డైరెక్టర్ శాంతలా వీగాస్, తెలంగాణ ప్రభుత్వ పూర్వ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంత, హెర్టీ స్కూల్ ప్రొఫెసర్ డాక్టర్ ముజు హీద్ షేక్ పాల్గొన్నారు. డిజిటల్ గవర్నెన్స్ చర్చలో రేజర్‌పే ఇండియా డైరెక్టర్ శరణ్య గోపీనాథ్, డెలాయిట్ సీఐవో సుధీర్ నీరసినేని, నాస్కామ్ ఫౌండేషన్ డైరెక్టర్ విక్రమ్ పాటిల్, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ పాల్గొన్నారు. వాతావరణ మార్పులపై చర్చలో అశోక్ లేలాండ్ కార్పొరేట్ స్ట్రాటజీ హెడ్ అలోక్ వర్మ, సంబోధి డిప్యూటీ ఉపాధ్యక్షుడు అభిషేక్ శర్మ, గ్రాంట్ థార్న్‌టన్ భారత్ ఎల్ఎల్‌పీ డైరెక్టర్ మోహన్ కుమార్ పాల్గొన్నారు. అప్పటికే ఆయా అంశాలపై పత్ర సమర్పణ చేసిన విద్యార్థులు నిపుణుల అభిప్రాయాలను ఆసాంతం ఆలకించడంతో పాటు పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కౌటిల్యా స్కూల్ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్, పలువురు ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వందపడకలతో గుమ్మడిదల ప్రభుత్వ ఆసుపత్రి

● ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్
● స్థల సేకరణకు సర్వే షురూ..



ఆసుపత్రిని సందర్శించిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి

గుమ్మడిదల, సెప్టెంబరు 21 : వంద పడకల ఆసుపత్రి దిశగా గుమ్మడిదల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం అడుగులు వేస్తుంది. గుమ్మడిదల మండలం నాయకులు శుక్రవారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి మండలంలోని హాస్పటల్ సంబంధించిన సమస్యను వివరించగా సానుకూలంగా స్పందించారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు శనివారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రిదేవితో కలిసి ఆ కేంద్రాన్ని సందర్శంచి స్థల పరిశీలన చేశారు. యుద్ధ ప్రాతిపదికన భూమి సేకరణకు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలు సంభవిస్తే వారికి వైద్య సేవలు అందించేందుకు వీలుగా గుమ్మడిదల ఆరోగ్య కేంద్ర స్థాయిని పెంచే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ముఖ్యంగా అత్యవసర వైద్య సేవాకేంద్రం(ట్రామ), 30 లేదా 50 పడకలు, ముందు చూపుగా 100 పడకలు ఆసుపత్రిని ఆధునీకరించడం కోసం అధికారులు, నాయకులతో చర్చించారు. ఆదివారం సంగారెడ్డి కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో పూర్తి నివేదికపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, జిల్లా ఇంజనీర్ రవీందర్, మండల తహసీల్దార్ గంగాభవాని, మండల అభివృద్ధి అధికారి డి. ఉమాదేవి, వైద్యాధికారి డా.మధుకర్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ఏఈవోల సమస్యలు పరిష్కరించండి

● డీఏవోకు వినతిపత్రం



డీఏవో రాధికకు వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 21: ఏఈవోలుగా తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నామని, తమ సమస్యలను పరిష్కరించాలని ఏఈవోలు కోరారు. ఈ మేరకు శనివారం డీఏవో రాధికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ రైతుబంధు, రైతుబీమా, పీఎంకిసాన్, పంటల నమోదు, రుణమాఫీ, పంట నష్టం అంచనా, పంట కోత ప్రయోగాలు తదితర పనులతో నిత్యం తీరిక లేకుండా సతమతమవుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేయడానికి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక సహాయకుడు గానీ, 1000 ఎకరాలు లేదా 500 మంది రైతులకు ఒక సహాయకుడుగానీ ఉండేలా నియామకం చేపట్టాలని కోరారు. రైతు వేదికల్లో అసాంఘిక కార్యక్రమాల నివారణకు వాచ్‌మెన్, సమావేశాల సమయంలో సహాయకుడిగా ఒక అటెండర్‌లను నియమించాలన్నారు. పదోన్నతి అవకాశం కల్పించాలని కోరారు.

తండ్రి వైద్యానికి చేసిన అప్పు తీర్చలేక ఆత్మహత్య

నర్సాపూర్, సెప్టెంబరు 21: అప్పు తీర్చే మార్గం లేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్ మండటం తుజాల్‌పూర్ పంచాయతీ పరిధిలోని అర్జున్‌తండాలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన హళావత్ శ్రీనివాస్(41) రైతు. తన తండ్రి లచ్చయ్య ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆసుపత్రుల కోసం దాదాపు రూ.4లక్షల వరకు అప్పులు చేశాడు. ఆ అప్పు ఎలా తీర్చాలని మనోవేదనకు గురవుతున్నాడు. కాగా, శనివారం తెల్లవారుజామున బహిర్భూమికని వెళ్లి ఎంతసేపటికి తిరిగిరాలేదు. చుట్టుపక్కల వెతకగా ఇంటి వెనుకాల చెట్టుకు శ్రీనివాస్ మృతదేహం వేలాడుతూ కనిపించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

వెలివేతకు గురైన దళిత కుటుంబానికి రక్షణ

● మెదక్ జిల్లా అధికారులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజిగూడానికి చెందిన పంచమి చంద్రం (33) ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేసి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. గ్రామంలోని సామాజిక ఆచారాల ప్రకారం డప్పు కొట్టడం లేదంటూ అతడి కుటుంబంపై సామాజిక బహిష్కరణ చేయాలని గ్రామస్థులు కొందరు లిఖితపూర్వకంగా తీర్మానం చేశారు. గ్రామంలో ఎవరూ సహకరించకపోవడంతో మనస్థాపం చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదై ఐదురోజులు గడుస్తున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్ రెడ్డి విచారణ చేపట్టారు. దీంతో కోర్టు బాధిత కుటుంబానికి భరోసా ఇవ్వాలని ఎస్పీ, కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ అక్టోబర్ 18కి వాయిదా వేసింది.

అభాగ్యురాలికి అండగా యువత

చేగుంట, సెప్టెంబరు 21: ఇటీవల భారీ వర్షాలకు ఇల్లు కూలి రోడ్డున పడ్డ అభాగ్యురాలికి గ్రామ యువత అండగా నిలిచింది. నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి ఇల్లు కూలిపోగా పాఠశాలలో పునరావాసం పొందుతున్నది. ఆమె దివ్యాంగురాలుకాగా భర్త ఇదివరకే చనిపోయారు. ఉన్న ఇద్దరు కుమారులు మానసిక వైకల్యంతో బాధపడుతున్నారు. దీంతో గ్రామ యువత ముందుకు వచ్చి ఆమెకు దాతల సహకారంతో నూతన ఇల్లు నిర్మించగా.. శనివారం గృహ ప్రవేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, సత్యనారాణ, జనార్దన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



భాగ్యలక్ష్మి ఇంటి వద్ద గ్రామస్థులు

ఖైదీలకు నాణ్యమైన భోజనం అందించాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్



సంగారెడ్డి సెంట్రల్ జైలులో వంటలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

కంది, సెప్టెంబరు 21 : ఖైదీలకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్ అన్నారు. శనివారం సంగారెడ్డి సెంట్రల్ జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని బ్లాకులు, ఖైదీల బ్యారక్‌లు, గదులు, వంటశాలలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో ఆయన మాట్లాడుతూ సమయానికి బెయిల్స్, ములాఖత్ అందుతున్నాయా అని ఆరా తీశారు. కేసులు త్వరతగతిన పరిష్కరించేందుకు న్యాయవాదులు లేనివారు జిల్లా న్యాయసేవాధికార సంస్థలో అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఖైదీలు ఉచిత న్యాయసేవలు పొందేందుకు వారి తరఫున న్యాయవాదులను నియమిస్తామన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో జడ్జీలు, కోర్టు సిబ్బంది, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

అల్లాదుర్గం, సెప్టెంబరు 21: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందని సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం టేక్మాల్ మండలానికి చెందిన మహ్మద్ ఖమర్ (52), అరవింద్‌తో కలసి పెద్దశంకరంపేటకు బైకుపై వెళ్లి శనివారం తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ముప్పారం శివారులోని 161వ జాతీయ రహదారి బ్రిడ్జిపై ముందు వెళ్తున్న ఆటోను బైకు ఢీకొట్టింది. దీంతో ఖమర్ తీవ్రగాయాలు కాగా, అరవింద్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరిని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఖమర్ చికిత్సపొందుతు మృతి చెందాడు. మృతుడి భార్య షరీనాబేగం ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఖమర్ (ఫైల్)

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు

● త్రుటిలో తప్పిన ప్రమాదం





కొండపాక, సెప్టెంబరు 21 : కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్లితే శనివారం హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు అతివేగంగా వెళుతూ అదుపుతప్పి తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారి పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీ కొట్టింది. దాంతో చెట్టు విరిగి రోడ్డు పక్కన నిలిచి ఉన్న కారుపై పడగా ధ్వంసమైంది. ఈ ఘటనకు దగ్గరలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నది. అదృష్టవశాత్తు చెట్టుకు ఢీకొట్టి కారు ఆగిపోయింది. లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

● ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

మిరుదొడ్డి,సెప్టెంబరు21: క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి సూచించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం మండలస్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి బహుమతులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీని పీఆర్టీయూ మిరుదొడ్డి మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశం, చంద్రారెడ్డిలు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభుదాస్, ప్రధానోపాధ్యాయుడు రవీందర్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.



చేర్యాల: విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు ఎల్లమ్మ

● కుకునూరుపల్లి: క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి తెలిపారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ క్రీడలు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి స్వప్న, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● రాయపోల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఎస్‌డీఎఫ్ క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సవ్వ, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, నాగరాజు, పీడీలు గోవర్ధన్‌రెడ్డి, పావని, పీఈటీలు అనీఫ్, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రాయపోల్: విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి


మిరుదొడి: భూంపల్లిలో బహుమతులు అందజేస్తున్న రఘోత్తంరెడ్డి, వెంకటయ్య



కుకునూరుపల్లి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

● సిద్దిపేట రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఎవరూ నిరాశ చెందవద్దని మండల విద్యాధికారి యాదవరెడ్డి విద్యార్థులకు సూచించారు. నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ క్రీడల ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వడ్డేపల్లి నాగరాజు, ఎస్‌జీఎఫ్ మండల సెక్రెటరీ తోట సతీష్, వివిధ పాఠశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ సరస్వతి, రజిత, మహేష్, వెంకటేష్, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మద్దూరు: మండల కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడల సెలక్షన్లు శనివారంతో ముగిశాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి ఇంతియాజ్‌హుస్సేన్, ఫిజికల్ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చేర్యాల: ఎస్‌జీఎఫ్ క్రీడల్లో చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్, వీరన్నపేట జడ్పీఎస్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో రెండో బహుమతి, ఖోఖోఅండర్-17 బాలికల విభాగంలో ప్రథమ బహుమతి, బాలురు రెండో బహుమతి పొందారు. అలాగే చేర్యాల మండలం వీరన్నపేట జడ్పీఎస్ఎస్ విద్యార్థులు ఖోఖో బాలికల విభాగంలో విజేతగా నిలిచి కప్‌ను కైవసం చేసుకున్నారు.

● మర్కుక్: ఎస్‌జీఎఫ్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, టీచర్లు శ్రీనివాస్‌రావు, కుమార్, రామకృష్ణారెడ్డి, రమణారావు, బాలకిషన్, కనకారావు, ఈవీఎన్‌రెడ్డి, వెంకట్, దయాకర్‌రావు, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

'పక్కదారి పట్టించేందుకే బీఆర్ఎస్ సందర్శన'

గజ్వేల్, సెప్టెంబరు 21: పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ మండిపడ్డారు. గజ్వేల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోగా, అన్నారం బ్యారేజీలో బుంగలు పడిన విషయాన్ని పక్కదారి పట్టించడానికి ఎమ్మెల్యేల బృందంతో మల్లన్నసాగర్ ప్రాంతాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు సందర్శించారన్నారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కమిషన్ దర్యాప్తు జరుగుతుండగా, ప్రజలను ఈ అంశం నుంచి పక్కదారి పట్టించడానికే రిజర్వాయర్ సందర్శనకు వెళ్లారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిన కేసీఆర్ సర్కార్ చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్ర భారం పడుతున్నట్లు చెప్పారు.

హాస్టల్ విద్యార్థులకు భోజనం అందించలేని దుస్థితిలో ప్రభుత్వం: వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 21: హాస్టల్ విద్యార్థులకు భోజనాన్ని అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉన్నదని గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలను ఏర్పాటుచేసి లక్షలాదిమంది విద్యార్థులకు ఒక్కొకరికి లక్షా 20వేల ఖర్చు చేసి కేజీ నుంచి పీజీ వరకు ఉచిత అందించారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అబద్ధపు హామీలతో గద్దెనెక్కి అసత్యపు మాటలతో పబ్బం గడుపుతుందన్నారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు భోజనం పెట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు, డైట్ చార్జీల బకాయిలు, విద్యార్థుల కాస్మోటిక్ చార్జీ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'కాళేశ్వరం'పై అసత్య ఆరోపణలు మానుకోవాలి


సిద్దిపేట టౌన్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు21: కాళేశ్వరంపై అసత్య ఆరోపణలు మానుకోవాలని, కాళేశ్వరం ఫలాలను రైతులకు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని బీఆర్ఎస్ నాయకులు పాల సాయిరాం, ఎడ్ల సోమిరెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ 21 టీఎంసీల నీటితో నిండు కుండను తలపిస్తున్నదని, ఇది ముమ్మాటికీ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుల కృషి ఫలితమేనని కొనియాడారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందన్నమాట పూర్తి అవాస్తవమని, అందుకు పార్లమెంటులో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు అవినీతి జరగలేదని కేంద్ర ప్రభుత్వం చెప్పిన సమాధానమే నిదర్శనమని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు సుందర్, బీఆర్ఎస్ నాయకులు, మోయిజ్, పాపయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు, సయ్యద్, సాయిచరణ్‌గౌడ్, గాడిచర్ల రాజు, భాను తదితరులు పాల్గొన్నారు.

● చిన్నకోడూరు: తక్కువ సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ రైతులు, ప్రజలకు గోదావరి జలాలను అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుదేనని మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, బీఆర్ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్, నముండ్ల రామచంద్రం పేర్కొన్నారు. చిన్నకోడూరులో శనివారం వారు మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారాలు చేశారని, ప్రాజెక్టు కూలిపోతే మల్లన్న సాగర్‌లోకి నీళ్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.

విమర్శలు మానుకోకపోతే గుణపాఠం తప్పదు

● మాజీ జడ్పీటీసీ దాసరి కళావతి

చేర్యాల, సెప్టెంబరు 21: చిల్లర రాజకీయాలు చేస్తూ సీపీఎం నాయకులు వ్యక్తిగత విమర్శలు మానుకోకపోతే గుణపాఠం తప్పదని చేర్యాల మాజీ జడ్పీటీసీ దాసరి కళావతి హెచ్చరించారు. చేర్యాల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పదవిలో ఉన్నా, లేకపోయినా నిస్వార్థంగా నియోజకవర్గ అభివృద్ధికి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పాటుపడుతూ, ప్రజాదరణ పొందడం ఓర్వలేక నిరాశ, నిస్పృహలకులోనవుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేసుకోవాలని పేర్కొన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను గాలికి వదిలివేసి దిగజారుడుతనానికి పాల్పడడంలో తనకుతానే సాటి అని విమర్శించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుర్మ


మాట్లాడుతున్న దాసరి కళావతి

ఆగంరెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, ముస్త్యాల తార, మార్కెట్ డైరెక్టర్ తడక లింగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ మండల కార్యదర్శి సనాది భాస్కర్, మాజీ సర్పంచు చెరుకు రమణారెడ్డి మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, భిక్షపతి, కనకరాజు, మల్లం బాలయ్య, బత్తిని నర్సింహులు, కాయిత మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

రాష్ట్రం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని హార్టికల్చర్ యూనివర్సిటీ ఉప కులాపతి నీరజ ప్రభాకర్ పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


ములుగు: కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద..


సిద్దిపేట టౌన్: కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు


హుస్నాబాద్ టౌన్: కొండా లక్ష్మన్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అశోక్‌గౌడ్

నంగునూరు,సెప్టెంబరు 21: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రంగు అశోక్ గౌడ్ సూచించారు. మండలంలోని వెంకటాపూర్‌లో మహాలక్ష్మి పథకం కింద మంజూరైన గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్‌లను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సందెబోయిన తిరుపతి యాదవ్, గ్రామ కార్యదర్శి అర్షద్, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన డీఎంహెచ్‌వో

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 21: సిద్దిపేట జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ శనివారం సీపీ బి.అనురాధను కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి సీపీ ఆయన్ను అడిగి తెలుసుకున్నారు.

ఆర్యవైశ్య సంఘం వర్గల్ మండల అధ్యక్షుడి నియామకం

వర్గల్, సెప్టెంబరు 21: వర్గల్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బ్రాహ్మండ్లపల్లి వెంకటయ్య గుప్తా నియమితులయ్యారు. మండల కేంద్రంలో శనివారం ఆర్యవైశ్య సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్యవైశ్య మహాసభ నేతలు సముద్రాల హరినాథ్, జూలూరి రంగయ్య గుప్తా మరోసారి మండల అధ్యక్షుడిగా నియామకమైన వెంకటయ్య గుప్తాకు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసయ్య, కోశాధికారి పవన్, ఉపాధ్యక్షుడు బాలేష్‌గుప్తా, రాజు, శ్రీనివాస్, శ్రీరాములు, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ అందజేత

నంగునూరు సెప్టెంబరు 21: నంగునూరు మండలంలోని మగ్దూంపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలకు రూ. 40 వేలు విలువచేసే మైక్ సెట్‌ను 2009-10 పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయ బృందానికి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, సురేందర్ రెడ్డి, గోవర్ధన్, సత్తయ్య, పరశురాములు, సాయినాథ్‌శర్మ, రాజు, రాజయ్య, పూర్వ విద్యార్థులు ప్రశాంత్, రాజు, రవి, కిషోర్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

మర్కుక్, సెప్టెంబరు 21: మర్కుక్ ఉన్నత పాఠశాలలో శనివారం తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లైబ్రరీ పుస్తకాలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మెన్ తలకొక్కుల లక్ష్మణ్, కోశాధికారి దుర్గాప్రసాద్ తదితులున్నారు.

'సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య'

దౌల్తాబాద్, సెప్టెంబరు 21: సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని శేరిపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా పాఠాలు చదివించారు. అదే విధంగా మల్లేశంపల్లి, ఇందుప్రియల్ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. డీఈవో శ్రీనివాస్‌రెడ్డిని ఎంఈవో నర్సవ్వ, ఉపాధ్యాయులు శాలువ కప్పి సన్మానించారు.

బయోచార్ వినియోగంపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న సాయిభాస్కర్‌రెడ్డి

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 21: జలచరాల యజమాన్యం (ఆక్వాకల్చర్)లో బయోచార్ వినియోగంపై సిద్దిపేట డిగ్రీ కళాశాలలో జువాలజీ, ఫిషరీస్ విభాగాల అధ్వర్యంలో శనివారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన బయోచార్ నిపుణుడు ఎన్ సాయిభాస్కర్‌రెడ్డి బయోచార్ వినియోగం గురించి విద్యార్థులకు వివరించారు. జలచరాల వ్యవస్థలో బయోచార్ వినియోగం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించటంలో సాధ్యమైన మార్గాలను, పర్యావరణానికి కలిగే లాభాలను వివరించారు. వర్క్‌షాప్‌లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, జువాలజీ విభాగాధిపతి పి. అయోధ్యరెడ్డి, జువాలజీ, ఫిషరీస్ అధ్యాపక బృందం విశ్వనాథం, మధుసూదన్‌రెడ్డి, హేమలత, వైకుంఠం, చక్రవర్తి, రాము, షాకీర్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి

చేర్యాల, సెప్టెంబరు 21: సమాజంలో మహిళలు వివక్షకు గురవుతున్న నేపథ్యంలో బాలికల విద్యాభివృద్ధికి పాలకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్రవ్యాప్త మహిళా ప్రతినిధులకు శనివారం కొమురవెల్లి మండలకేంద్రంలో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. దేశంలో ఎన్ని చట్టాలున్నా మహిళలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. అంతకుముందు ఎస్ఎఫ్ఐ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎం. పూజ సోషలిజం పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్, సహాయ కార్యదర్శి ఎం.మమత, జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, మహిళా కో-కన్వీనర్ ఎం. మమత రమ్య, దీపికా, ప్రతినిధులు మానస, అమూల్య, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రైలుకు అనుగుణంగా బస్సులు నడపాలి'

గజ్వేల్, సెప్టెంబరు 21: రైలు సమయానికనుగుణంగా బస్సులు నడపాలని లోకసత్తా ఉద్యమసంస్థ ఉభయ రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహన్‌రావు రైల్వే, ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ పవన్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్-సిద్దిపేట రైల్వే లైన్‌లో ప్యాసింజర్ రైలు ప్రవేశపెట్టి సంవత్సరం దాటినా ఇప్పటివరకు ప్రయాణికుల సంఖ్య పెరగకపోవడానికి రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి, రావడానికి సరైన రవాణా సౌకర్యం లేకపోవడమే కారణమన్నారు. ప్రజ్ఞాపూర్, సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్లతో సంప్రదించి రైల్వే అధికారులు రైల్వేస్టేషన్ వరకు రైలు వచ్చే సమయానికి ముందుగానే బస్సు సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

మంత్రి పొన్నంకు.. హుస్నాబాద్‌పై ప్రేమ లేదు

● మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్, సెప్టెంబరు 21: రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి, మన ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌కు కరీంనగర్, హైదరాబాద్‌లో ఉండాలన్నా ఆలోచనే తప్పా హుస్నాబాద్‌పై ప్రేమ లేదని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆరోపించారు. హుస్నాబాద్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సొంత పార్టీ నాయకులను కూడా నమ్మకుండా ప్రతీ మండలానికి కుటుంబసభ్యులను పెట్టుకుని పనిచేస్తున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం కచ్చితంగా విజయం సాధిస్తామని, అందరం ఐక్యంగా కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. గతంలో ఒక గ్రామంలో సర్పంచ్ స్థానానికి నలుగురు పోటీ పడటం వల్ల విభేదాలు తలెత్తాయని, అలాంటి పరిస్థితి ఇప్పుడు రానివ్వద్దన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. అనంతరం బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్ణరావు మాట్లాడుతూ.. మంత్రి పొన్నం కాంగ్రెస్ తొమ్మిది నెలల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, మాజీ జడ్పీ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, అయిలేని అనిత, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రావు, నేషనల్ లేబర్ కోఆపరేటివ్ డైరెక్టర్ దండుగుల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీలు వినీత, కీర్తి, మానస, లక్ష్మి, ప్రభాకర్‌రెడ్డి, ఆకుల వెంకట్, నియోజకవర్గ అధికార ప్రతినిధులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, సుద్దాల చంద్రయ్య, ఎండీ అన్వర్, జడ్పీటీసీలు మంగ, రవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు అశోక్‌బాబు, తిరుపతిరెడ్డి, రజని, నళిని దేవి, సుప్రజ, క్రాంతి, పరుశురాములు, మధుసూదన్‌రెడ్డి, అంజయ్య తదితరులున్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి


సిద్దిపేట క్రైం: కోర్టు పరిసరాలను శుభ్రం చేస్తున్న ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 21: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి సూచించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో శనివారం స్వచ్ఛ హి సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని తెలిపారు. అనంతరం ఈ నెల 28వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై పోలీస్, ఎక్సైజ్, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి మిలింద్ కాంబ్లె, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. చందన, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి పాల్గొన్నారు.

సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ట్రాఫిక్ సీఐ తెలిపారు. పచ్చదనం, పరిశుభ్రత ఆహ్లాదకరమైన వాతావరణం మనిషి మనుగడకు చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు ఉమేష్, హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులు, రాజిరెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

● గజ్వేల్: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు వద్ద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వారితో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు వంటేరు గోపాల్‌రెడ్డి, మామిడి విద్యారాణి శ్రీధర్, ఉప్పల మెట్టయ్య, బొగ్గుల చందు, కోఆప్షన్ సభ్యుడు గంగిశెట్టి రాజు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, మెప్మా సీఈవో, మున్సిపల్ ఆఫీసర్లు, జవాన్లు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

● హుస్నాబాద్ టౌన్: కూరగాయల మార్కెట్‌లో చెత్త లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత సూచించారు. హుస్నాబాద్ పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా చెత్తను ఏరివేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు అయిలేని శంకర్‌రెడ్డి, రవికుమార్ తదితరులున్నారు.

'ఆలయ భూమిని కాపాడండి'


జగదేవ్‌పూర్: ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న దౌలాపూర్ గ్రామస్థులు

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 21: మండలంలోని దౌలాపూర్ తిరుమలాయ ఆలయ భూములను కాపాడాలని శనివారం దేవాలయ ట్రస్ట్ సభ్యులు, గ్రామస్థులు గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, జగదేవ్‌పూర్ తహసీల్దార్ కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో 266, 267 సర్వే నెంబర్‌లలో ఉన్న 15 ఎకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణమూర్తి, నర్సమ్మ, నర్సింహులు, రాంరెడ్డి, నాగులు తదితరులు పాల్గొన్నారు.

● కోహెడ: మండలంలోని ధర్మసాగర్‌పల్లి లెంకల బోరు గుట్ట ప్రాంతంలో ఉన్న 876 సర్వే నెంబర్‌లో గల 190 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం శనివారం తహసీల్దార్ సురేఖకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఈ సర్వే నెంబర్‌లో 29 మందికి 57 ఎకరాల భూమిని కేటాయించి పట్టాలిచ్చారని, మిగిలిన 133 ఎకరాల్లో ఉన్న భూమి అక్రమణకు గురైందన్నారు. ఆయనవెంట గ్రామస్థులు కరివేద చంద్రారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దయ్యాల రాజయ్య, బాల్‌రెడ్డి, నాగుల కనకయ్య, సంతు ఉన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం: సీడీపీవో

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 21: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని సీడీపీవో సరిత పేర్కొన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా శనివారం తిగుల్ పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రజిత, సునిత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనసూయ, ఉపాధ్యాయులు నాగరాజు, కిరణ్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు రుక్మిణి, కళ, కవిత, సరిత, రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

● గజ్వేల్: పోషణ మాసోత్సవాన్ని ప్రజలు సద్వినియెగం చేసుకోవాలని గజ్వేల్ సీడీపీవో సరిత కోరారు. గజ్వేల్ మండల పరిధిలోని కోమటిబండ రైతువేదికలో పోషణ మాసోత్సవం కార్యక్రమాన్ని వైద్యాధికారి ప్రణయ్‌రాజ్ కుమార్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలింతలకు, గర్భిణిలకు పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. వారితో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, వైద్యారోగ్య శాఖ సూపర్‌వైజర్ శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులున్నారు.

● మిరుదొడ్డి: తల్లీపాలే బిడ్డకు శ్రీరామరక్షని, పుట్టిన బిడ్డకు కచ్చితంగా ముర్రుపాలను పట్టాలని మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డి సూచించారు. మిరుదొడ్డిలో శనివారం పోషణ అభియాన్ వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో జహిరొద్దిన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నిఖత్ అంజూమ్

గజ్వేల్, సెప్టెంబరు 21: గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిఖత్ అంజూమ్ మాట్లాడుతూ.. పాత, కొత్త విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల సీపీడీసీ మెంబర్ టీ.లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.గణపతిరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డి.వెంకటేశ్, అకాడమీ కోఆర్డినేటర్ లక్ష్మీనర్సయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● బీజేపీ ఆర్మీసెల్ జిల్లా సెల్ కన్వీనర్ నీల చంద్రం

రాయపోల్, సెప్టెంబరు 21: రాష్ట్ర ప్రభుత్వం మాజీ సైనికుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా మాజీ సైనిక ఉద్యోగుల సెల్ కన్వీనర్ నీల చంద్రం డిమాండ్ చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో మాజీ సైనికుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, దేశ రక్షణలో పాలుపంచుకొన్న రాష్ట్రానికి చెందిన మాజీ సైనికుల సంక్షేమానికీ ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్ల ఆందోళన

ములుగు, సెప్టెంబరు 21: మార్కెట్‌లో కూరగాయల క్రయ విక్రయాలు అనుమతులు పొందిన కమీషన్ ఏజెంట్ల ద్వారానే కూరగాయల అమ్మకాలను నిర్వహించాలని కోరుతూ శనివారం వారు ఆందోళనకు దిగారు. వంటిమామిడి కూరగాయల మార్కెట్‌లో దళారులు ఇతర మార్కెట్‌ల నుంచి కూరగాయలు తెచ్చి విక్రయిస్తున్నారని, దీనివల్ల రైతుకు గిట్టుబాటు ధర లభించడం లేదని కమీషన్ ఏజెంట్లు పేర్కొన్నారు. ఉదయం నిర్వహించే మార్కెట్‌లో రైతులు కమీషన్ ఏజెంట్ల వద్దే విక్రయాలు జరపాలని నిర్ణయించారు. శనివారం ఈ ప్రక్రియ జరుగుతుండగా ఎలాంటి అనుమతులు లేని కొంతమంది దళారులు వచ్చి క్రయవిక్రయాలను అడ్డుకున్నారు. దీంతో కమీషన్ ఏజెంట్లకు, దళారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయమై మార్కెట్ కార్యదర్శి రేవంత్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల అనుమతితోనే కమీషన్ ఏజెంట్లు యథావిధిగా కూరగాయలు అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు దిగుళ్లకుమార్, ఉపాధ్యక్షులు శివకుమార్, శేఖర్, ప్రధాన కార్యదర్శి రామచంద్రం, కోశాధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి'

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 21: ఇటీవల బదిలీ అయిన ఎస్టీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్టీటీయూ నాయకులు డిమాండ్ చేశారు. జగదేవ్‌పూర్‌లోని ఎమ్మార్సీ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ వేణు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలలకు ఐదుగురు ఉపాధ్యాయులతో పాటు ఒక ప్రధానోపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అంకం వెంకటేశ్వర్లు, రాజేందర్, సంతోషికుమారి, ఎస్తేర్ రాణి, కవిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

'అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి'

కొండపాక, సెప్టెంబరు 21: బదిలీలు, పదోన్నతుల్లో అక్రమాలకు పాల్పడినవారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కనకయ్య డిమాండ్ చేశారు. మండల టీపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని దుద్దెడ ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్నుకున్నారు.

'సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం'

వర్గల్, సెప్టెంబరు 21: ఉపాధ్యాయుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధరశర్మ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం న్విహించిన పీఆర్టీయూ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైనారు. మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డిలను అభినందించారు.